సాక్షి
అనకాపల్లి
శనివారం । 18 । జనవరి । 2025



కూటమి బెట్టింగ్ @140 కోట్లు!

బెట్టింగ్ రాయుళ్లు కూటమి నేతలే..!

- బెట్టింగ్‌లో కీలకంగా లగుడు రవి, బొబ్బిలి రవి
- కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న పవన్, నాగబాబు
- ఇంకా పరారీలోనే నిందితులు
- ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు
- సహకరిస్తున్న కూటమి ఎమ్మెల్యేలు?
- 80 అకౌంట్లను పరిశీలించిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

క్రికెట్ బెట్టింగ్ ముఠా వ్యవహారంలో కూటమి నేతలదే కీలకపాత్ర అని తెలుస్తోంది. ప్రధాన నిందితులు లగుడు రవితో పాటు ప్రముఖ పాత్ర పోషిస్తున్న బొబ్బిలి రవి పరారీలో ఉన్నారు. వీరిద్దరూ జనసేన పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో విచారణ చేస్తున్న విశాఖ సిటీ పోలీసులు ఇప్పటి వరకు జరిగిన 80 బ్యాంకు అకౌంట్లను పరిశీలిస్తే కేవలం ఏడాది కాలంలోనే రూ.140 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. అయితే ఇంకా వందల్లో గుర్తించిన బ్యాంకు అకౌంట్లను పరిశీలించాల్సి ఉందని సమాచారం. వీటి లావాదేవీలను గమనిస్తే ఇంకా ఎన్ని వందల కోట్లకు చేరుతుందనేది ఊహకు కూడా అందడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

క్రికెట్ బెట్టింగ్‌లో కీలకంగా ఉన్న లగుడు రవితో పాటు బొబ్బిలి రవి జనసేన పార్టీలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. ఇందులో బొబ్బిలి రవిని స్వయంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో పాటు నాగబాబు సమక్షంలో కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. వీరిని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ చేర్చడం గమనార్హం. ఇప్పుడు ఈ ఫొటోలు వైరల్‌గా మారాయి. ఇక లగుడు రవి కూడా జనసేన పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఇప్పటివరకు కేవలం లగుడు రవి ద్వారా వచ్చిన సమాచారంతో ఐదుగురిపై కేసులు నమోదు చేసిన సైబర్ క్రైం పోలీసులు.. తాజాగా మరో నలుగురిని అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టారు. వీరి బ్యాంకు లావాదేవీలు పరిశీలిస్తే.. రూ.140 కోట్లు ఉండగా..ఇంకా మొత్తం అకౌంట్లు పరిశీలిస్తే ఇంకా ఎన్ని వందల కోట్లకు చేరుతుందోనని చర్చ సాగుతోంది.

ఇంకా లెక్కతేలాల్సిందే...!

వాస్తవానికి కొద్దిరోజుల క్రితం ఇసుకతోట, శివాజీ పాలెం వద్ద జరుగుతున్న క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంపై వచ్చిన సమాచారం మేరకు ఈ నెల 6వ తేదీన టాస్క్‌ఫోర్స్ పోలీసులు జరిపిన దాడిలో లగుడు రవి కుమార్‌ను అదుపులో తీసుకున్నారు. అనంతరం జరిపిన విచారణలో ఇందులో మరో వ్యక్తి బొబ్బిలి రవి, త్రినాథ్, జిలానీ, కాకినాడకు చెందిన కార్తీక్‌ల పాత్ర కూడా తేలింది. ఇందులో ఇప్పటికీ బొబ్బిలి



బొబ్బిలి రవిని కండువా కప్పి పార్టీలో చేర్చుకున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్, నాగబాబు (ఫైల్)

రవితో పాటు మిగిలిన వ్యక్తులు అందరూ పరారీలోనే ఉన్నారు. వీరి కుటుంబ సభ్యులు కూడా ఇళ్లు వదిలి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. ఇప్పటివరకు లగుడు రవిని విచారించిన తర్వాత 80 బ్యాంకు అకౌంట్లను పరిశీలించగా... ఏడాది కాలంలోనే ఈ అకౌంట్ల ద్వారా రూ. 140 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్టు విశాఖ సిటీ పోలీసులు ప్రకటన విడుదల చేశారు. అయితే బొబ్బిలి రవిని, కాకినాడకు చెందిన కార్తీక్‌ను కూడా అదుపులోకి తీసుకుంటే ఇంకా ఎన్ని వందల సంఖ్యలో బ్యాంకు అకౌంట్లు ఉన్నాయో తెలిసే అవకాశం ఉంది. ఇదే జరిగితే మొత్తం క్రికెట్ బెట్టింగ్ ముఠా జరిపిన ఒక్క ఏడాది లావాదేవీలే మరిన్ని వందల కోట్లు ఉండే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదుపులోకి తీసుకోకుండా...!

సుమారు 10 రోజుల క్రితం జరిగిన సంఘటనలో బొబ్బిలి రవి, త్రినాథ్‌లను అదుపులోనికి తీసుకోకుండా ఉండేందుకు కూటమి ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేసినట్టు విమర్శలున్నాయి. కూటమికి చెందిన ఎమ్మెల్యేతో పాటు పీఏలు కూడా అరెస్టు చేయవద్దంటూ సిఫారసులు చేశారనే ఆరోపణలున్నాయి.

ఈ నేపథ్యంలోనే బొబ్బిలి రవి పరారీలో ఉన్నారు. అంతేకాకుండా తన కుటుంబ సభ్యులను కూడా ఇంట్లో ఉండకుండా జాగ్రత్తపడినట్టు తెలుస్తోంది. మరోవైపు వీరికి ముందస్తు బెయిల్ కోసం కూడా కూటమి ఎమ్మెల్యేలు కొందరు ప్రయత్నిస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికే ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేశారని... ఇందుకోసం ఒక ఎమ్మెల్యే పీఏ ఒక్కో వ్యక్తి నుంచి రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకూ వసూలు చేశారనే ప్రచారం ఆ పార్టీల్లోనే జరుగుతోంది. ఇదిలావుండగా తెర వెనుక కూటమి ఎమ్మెల్యే చేస్తున్న వ్యవహారం నగర పోలీసు కమిషనర్ దృష్టికి వెళ్లడంతో వారి ఆటలు సాగడం లేదన్న ప్రచారం జరుగుతోంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ సాధ్యం కాదని, వారిని కచ్చితంగా అదుపులో తీసుకుంటామని విశాఖ సిటీ పోలీసులు స్పష్టం చేస్తున్నారు.

ఎవరీ కాకినాడ కార్తీక్...!

ఈ క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో కీలకంగా ఉన్న కాకినాడ కార్తీక్ ఆచూకీ లభ్యం కాలేదు. కాకినాడకు వెళ్లి విచారించిన పోలీసులకు కార్తీక్ ఎవరనే విషయం మాత్రం బోధపడలేదని తెలుస్తోంది. కార్తీక్‌కు కాకినాడలో అనేక పేర్లతో వ్యవహారంలో ఉన్నాడని సమాచారం. ఒక్కొక్కరికి ఒక్కో పేరుతో కార్తీక్ పరిచయం కావడం గమనార్హం. అంతేకాకుండా పోలీసులు దర్యాప్తు కోసం వెళ్లే సమయానికే కుటుంబ సభ్యులతో కలిసి పరారయ్యారు. కార్తీక్‌కు విశాఖపట్నంతో పాటు హైదరాబాద్‌లో కూడా బెట్టింగ్ ముఠాతో సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. కార్తీక్‌ను కదిపితే బెట్టింగ్ మాఫియా వివరాలు మరిన్ని తెలిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కనకమహాలక్ష్మి సన్నిధిలో న్యాయమూర్తులు



కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ముగ్గురు న్యాయమూర్తులు

యలమంచిలి రూరల్ : పట్టణంలోని ధర్మవరంలో కొలువుదీరిన కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధిలో యలమంచిలి నాయస్థానాల న్యాయమూర్తులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయం పక్కనే న్యాయస్థానాల సముదాయం ఉంది. ఇటీవల అమ్మవారి మార్గశిర మాసోత్సవాలను ఉత్సవ కమిటీ వైభవంగా నిర్వహించింది. ఆదివారం అమ్మవారి జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి.స్వాతి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి టి.వీర రాఘవేంద్రరావు శుక్రవారం అమ్మవారి ఆలయానికి వచ్చి అమ్మవారికి పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమలతో విశేష పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు వెలవలపల్లి కుమార కోటేశ్వరశర్మ తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన న్యాయమూర్తులకు ఉత్సవ కమిటీ చైర్మన్ కొటారు సాంబ, సభ్యులు సాదరంగా ఆహ్వానం పలికారు.

నేడు 'నవోదయ' ప్రవేశ పరీక్ష

మాడుగుల: ఉమ్మడి విశాఖ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష శనివారం జరగనుందని జవహర్ నవోదయ విద్యాలయం (కొమ్మాది) ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. మాడుగుల మండలం ఘాట్‌రోడ్ జంక్షన్‌లో శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడారు. శనివారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరగనుందన్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు ఇప్పటికే మూడు జిల్లాల పరీక్ష కేంద్రాల సూపరింటెండెంట్లకు, పరిశీలకులకు మూడు జిల్లాల డీఈవో కార్యాలయాల్లో శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ ఏడాది ప్రవేశ పరీక్ష రాసేందుకు 9,080 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. విశాఖ జిల్లాలో 20 పరీక్ష కేంద్రాలు, అనకాపల్లి జిల్లాలో 15 కేంద్రాలు, అల్లూరి జిల్లాలో 4 పరీక్ష కేంద్రాలు మొత్తం 39 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ఫ్లయింగ్ స్క్వాడ్స్, కేంద్ర స్థాయి పరిశీలకులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షిస్తారన్నారు. నవోదయ విద్యాలయం ద్వారా మొబైల్ స్క్వాడ్స్ కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట ఎగ్జామినేషన్ ఇన్‌చార్జి జి.భక్తవత్సలం కూడా ఉన్నారు.

హత్యాయత్నం కేసులో ఏడేళ్ల జైలు శిక్ష

సాక్షి, అనకాపల్లి: హత్యాయత్నం కేసులో ముద్దాయిలకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధించారు. ఈమేరకు శుక్రవారం యలమంచిలి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి పి.విజయ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో నలుగురు ముద్దాయిలకు జైలు శిక్ష విధించారు. 2011 డిసెంబర్ 3వ తేదీన పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామంలో నివసిస్తున్న ఫిర్యాదీ పులుగుల సన్యాసమ్మ, భర్త రామచంద్రరావుల ఇంటికి ముద్దాయిలు వచ్చి రాడ్డుతో కొట్టి హత్యాయత్నం చేశారు. ఏ 1 పులుగు సత్యవతికి, ఫిర్యాదీ భర్త రామచంద్రరావుల మధ్య వివాహేతర సంబంధం విషయమై గొడవపడి రాడ్డుతో కొట్టగా అప్పటి ఎస్సై జి.ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేసి ముద్దాయిలను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూర్తయిన తర్వాత శ్రీరామాపురం గ్రామానికి చెందిన ఏ 1 పులుగు సత్యవతి, ఏ 2 పులుగు రాంబాబు, ఏ 3 పులుగు బంగారి, ఏ 4 పిల్లా ప్రసాద్‌లకు ఏడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ యలమంచిలి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు తీర్పు ఇచ్చింది. దర్యాప్తు అధికారి అప్పటి ఎస్సై జి.ప్రేమ్‌కుమార్‌ను, పాయకరావుపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సెల్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి, నిందితులకు శిక్ష పడే విధంగా దర్యాప్తు నిర్వహించిన అధికారులను ప్రశంసించారు.

వాతావరణం



అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలు ఈనెల 18న 17.3 డిగ్రీలు, 19న 17.3, 20న 16.8, 21న 16.9, 22న 16.8 డిగ్రీలు నమోదవుతాయని, గాలి గంటకు 2 నుంచి 3 కిలోమీటర్ల వేగంతో వీస్తుందన్నారు.

'పీఎం ఇంటర్న్‌షిప్'తో నైపుణ్యాభివృద్ధి

తుమ్మపాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు ఉత్తమమైన ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ ఎస్.గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీ- ఫార్మా, బీటెక్ వంటి డిగ్రీలు పూర్తి చేసినవారు, చివరి సెమిస్టర్ చదువుతున్నవారు ఆన్‌లైన్‌లో httpr://pminternship.mca.gov.in/ofin వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 6 నుంచి 12 నెలల పాటు నిర్వహించే ఇంటర్న్‌షిప్‌లో 21 నుంచి 24 ఏళ్ల వయస్సు కలిగి యువత మాత్రమే అర్హులన్నారు. 500 మల్టీ నేషనల్ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందన్నారు. ఎంపికైన వారికి వన్‌టైమ్ గ్రాంట్‌గా రూ.6,000, ప్రతి నెలా రూ.4,500, కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 500, పరిశ్రమల సీఎస్సార్ నిధుల ద్వారా ఆర్థిక సహాయం మొత్తం రూ.5000తోపాటు ప్రధానమంత్రి జీవిత బీమా యోజన, ప్రధానమంత్రి ప్రమాద బీమా యోజన వర్తిస్తుందన్నారు.

నేడు జెడ్పీ స్థాయీ సంఘం, సర్వసభ్య సమావేశాలు

మహారాణిపేట (విశాఖ): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉదయం 9.00 నుంచి 10.30 గంటల వరకు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ చాంబర్ సమీపంలోని వీసీ హాలులో, జెడ్పీ సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం నుంచి నిర్దేశిత సమయాల్లో జరుగుతాయని చెప్పారు. ప్రాదేశిక నియోజక వర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కోరారు. ఉదయం 10.30 గంటల నుంచి సర్వసభ్య సమావేశం కొనసాగుతుందని, జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

పులి కాదు.. అది నక్కే!

- వదంతులను నమ్మొద్దు
- యలమంచిలి అటవీశాఖ సెక్షన్ అధికారి రమణ స్పష్టీకరణ
- గొరపూడి కొండ ప్రాంతంలో పులి జాడల కోసం అన్వేషించిన అటవీ అధికారులు



గొరపూడి కొండ ప్రాంతంలో పులి జాడల కోసం గాలిస్తున్న యలమంచిలి అటవీశాఖ అధికారులు

రాంబిల్లి (యలమంచిలి): పులి కాదు...నక్కే అని యలమంచిలి అటవీ రేంజ్ సెక్షన్ అధికారి బి.వి రమణ స్పష్టం చేశారు. రాంబిల్లి మండలం నేవీ కాలనీ కొండ ప్రాంతంలో ఒక గుడి దగ్గర పులి సంచరిస్తున్నట్టు స్థానికులు కొంత మంది గురువారం రాత్రి సోషల్ మీడియాలో వీడియోలు తీసి ఫొటోలను పోస్టు చేయడం ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో బాగా వైరల్ అవ్వడం స్థానికంగా సంచలనం కలిగించిన విషయం విదితమే. దీనిపై శుక్రవారం యలమంచిలి అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ అనిల్‌కుమార్ ఆదేశాలతో అటవీశాఖ సెక్షన్ అధికారి రమణ, అటవీశాఖ అధికారులు బృందం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి రాంబిల్లి మండలంలోని గొరపూడి కొండ ప్రాంతంలో జంతువు పాద ముద్రలను పరిశీలించి గాలించారు. ఈ సందర్భంగా నక్క పాద ముద్రలను గుర్తించారు. అక్కడ సంచరించింది పులి కాదు నక్క అని ధృవీకరించారు. స్థానిక కొండ ప్రాంతానికి సముద్ర తీరం దగ్గరగా ఉండడం వల్ల అడవి జంతువులు కొన్ని సంచరిస్తున్నాయని, వాటిలో నక్కలు కూడా ఎక్కువగా ఉన్నాయని అధికారులు తెలిపారు. ఒక వేళ పులి సంచరించి ఉంటే చుట్టు పక్కల ఎక్కడో చోట ఏదో ఒక జంతువును వేటాడుతుందని, కానీ పులి జాడలు ఎక్కడా తమ కంట పడలేదని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు. ప్రజలెవరూ ఈ పులి ఉందంతంపై ఆందోళన చెందాల్సిన పనిలేదని తెలిపారు. ఇటువంటి ఘటనలు, అటవీ అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు టోల్ ఫ్రీ నెంబరు 1800-425-5909కు ఫోన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి అటవీశాఖ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రషింగ్ కోసం చెరకు గడలను రైతులు సిద్ధం చేసుకున్నారు. బళ్లు ఎక్కించి గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి తరలించడానికి రెండు రోజుల క్రితమే ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే కార్మికుల నిరవధిక సమ్మె కారణంగా ఏర్పడిన ప్రతిష్టంభనతో ఎక్కడి వారు అక్కడ ఆగిపోయారు. జీతభత్యాల బకాయిలు చెల్లిస్తే కానీ క్రషింగ్ పనులు చేపట్టబోమని కార్మికులు భీష్మించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు **నిర్లక్ష్యం వహించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.**



గోవాడ చక్కెర కర్మాగారం

క్రషింగ్‌కు సమ్మెట పోటు

- బకాయిల కోసం గోవాడ సుగర్స్ కార్మికుల సహాయ నిరాకరణ
- క్రషింగ్ ప్రారంభం కాకపోవడంతో చెరకు రైతుల్లో ఆందోళన
- ఆలస్యమైతే బెల్లం క్రషర్లకు చెరకు తరలిపోయే ప్రమాదం
- బకాయిలు రాబట్టడంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు విఫలం

చోడవరం: కార్మికుల నిరవధిక సమ్మె గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మనుగడకు ముప్పుగా మారింది. వీరి సమ్మె ఈ ఏడాది క్రషింగ్ సీజన్ ప్రారంభంపై తీవ్ర ప్రభావం చూపింది. వాస్తవానికి ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న గోవాడ ఫ్యాక్టరీ మొదట్లో ఈ ఏడాది క్రషింగ్ చేపట్టాలా.. వద్దా అనే మీమాంసలో పడింది. అయితే యాజమాన్యం చొరవతో రైతుల నుంచి 1.70 లక్షల టన్నుల చెరకును సరఫరా చేసుకునేందుకు అగ్రిమెంట్లు వచ్చాయి. దీంతో క్రషింగ్‌కు సర్వం సిద్ధం చేసుకుంది. ప్రతి ఏటా డిసెంబరు రెండో వారంలోనే రెగ్యులర్ క్రషింగ్‌ను ప్రారంభించే ఫ్యాక్టరీ ఈ **ఏడాది ఓవరాయిలింగ్ పనులు ఆలస్యం కావడంతో క్రషింగ్ ప్రారంభానికి కొంత సమయం తీసుకుంది. డిసెంబరు 25వ తేదీనే లాంఛనంగా క్రషింగ్ ప్రారంభించినప్పటికీ రెగ్యులర్ క్రషింగ్ సంక్రాంతి వెళ్లిన వెంటనే ఈనెల 16వ తేదీ** నుంచి కొనసాగించడానికి యాజమాన్యం అన్ని చర్యలు చేపట్టింది. ఇందుకు సంబంధించిన కటింగ్ పర్మిట్లు కూడా ముందుగానే ఇవ్వడంతో రైతులు కూడా చెరకు సరఫరా చేసేందుకు సిద్ధమయ్యారు. ఇంతలో గత కొంతకాలంగా జీతభత్యాలు ఇవ్వకపోవడంతో వారం రోజుల నుంచి కార్మికులు దశలవారీగా ఆందోళనకు దిగారు. సంక్రాంతికి కొంతమేర చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇవ్వడంతో రెగ్యులర్ క్రషింగ్ 16 నుంచి అనుకున్న సమయానికే ప్రారంభమవుతుందని అంతా భావించారు. అయితే నేటికీ బకాయిల్లో కొంత కూడా చెల్లించకపోవడంతో కార్మికులు నిరవధిక సమ్మెకు దిగారు. వీరి సమ్మె ప్రభావం ఫ్యాక్టరీ రెగ్యులర్ క్రషింగ్‌పై పడింది.

ఎక్కడి బళ్లు అక్కడే..

రైతులు 16వ తేదీకే చెరకు సరఫరా చేసేందుకు చెరకు తోటలు నరికి బళ్లకు ఎక్కించి ఫ్యాక్టరీకి సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో క్రషింగ్ సమయానికి రెండ్రోజులు దాటినా కార్మికులు సమ్మెను విరమించకపోవడంతో క్రషింగ్ ప్రారంభం కాలేదు. దీంతో ఎక్కడి బళ్లు అక్కడే ఆగిపోయాయి. మొలాసిస్, పంచదార, అమ్మకాల వల్ల ప్రభుత్వం, విశాఖ డెయిరీ నుంచి సుమారు రూ.6 కోట్ల మేర బకాయిలు ఫ్యాక్టరీకి రావల్సి ఉంది. ఇవి రాకపోవడం వల్ల రైతులకు గత ఏడాదికి సంబంధించి టన్నుకు రూ.150, కార్మికులకు జీతభత్యాల కింద రూ.3 కోట్ల మేర చెల్లించడానికి ఫ్యాక్టరీ వద్ద డబ్బులు లేకపోయాయి. డబ్బులు రప్పించేందుకు చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు చొరవ చూపించకపోవడంతో సకాలంలో డబ్బులు రాలేదు. దీనిపై మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ కూడా పలు మార్లు అధికార పార్టీ ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ పరిణామం ఇప్పుడు ఫ్యాక్టరీ క్రషింగ్, మనుగడపై పడింది. ఇప్పటికే కటింగ్ పర్మిట్లు తీసుకొని చెరకు నరికి, సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు.. క్రషింగ్ రెండ్రోజుల్లో ప్రారంభించకపోతే ప్రైవేటు బెల్లం క్రషర్లకు పంపించాలని ఆలోచిస్తున్నారు. ఇదే **గాని జరిగితే ఈ ఏడాది** ఫ్యాక్టరీ క్రషింగ్ ఆదిలోనే **మూలకు చేరే పరిస్థితి** నెలకొంటుంది. ఈ ఏడాది క్రషింగ్ చేయకపోతే వచ్చే సీజన్‌కు ఫ్యాక్టరీని మూసేసే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటే సుమారు వెయ్యి మంది కార్మిక కుటుంబాలు, 23 వేల మంది రైతుల కుటుంబాలు జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా రావలసిన పాత బకాయిలు వసూలు చేయడంలో అధికార పార్టీ ఎమ్మెల్యే చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదేవిధంగా కొంత మేర అయినా కార్మికులకు జీతభత్యాలు ఇచ్చి వెంటనే వారిని విధుల్లోకి తెచ్చి క్రషింగ్ ప్రారంభించేలా యాజమాన్యం కూడా మరింత శ్రద్ధ పెట్టాలి. ఎవరు నిర్లక్ష్యం చేసినా ఫ్యాక్టరీ భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని రైతులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలావుండగా కార్మికుల సమ్మె వ్యవహారం చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు వద్దకు చేరింది. యాజమాన్యం, కార్మికులతో ఎమ్మెల్యే సమావేశమై సమ్మె విరమించాలని కోరారు. అయితే కార్మికులు మాత్రం కొంతైనా బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు.



రెండ్రోజుల్లో క్రషింగ్ ప్రారంభిస్తాం: ఎండీ

కార్మికులకు కొంతమేర జీతభత్యాలు చెల్లించి, రెండ్రోజుల్లో రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభిస్తామని ఫ్యాక్టరీ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు, రావలసిన బకాయిలు సకాలంలో రాకపోవడం వల్లే కార్మికులకు, రైతులకు పాత బకాయిలు చెల్లింపుల్లో కొంత ఆలస్యమైందని, దీనిపై చర్యలు తీసుకున్నామని ఎండీ చెప్పారు.

క్లుప్తంగా

మూడు నెలల్లో 30,440 లీటర్ల పులుపు ధ్వంసం



సారా బట్టీలపై దాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్ పోలీసులు

నర్సీపట్నం: ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక నిఘాతో నర్సీపట్నం సర్కిల్ పరిధిలో సారా నిర్మూలనకు విస్తృతంగా దాడులు నిర్వహిస్తున్నారు. నర్సీపట్నం, మాకవరపాలెం, కోటవురట్ల, రోలుగుంట మండలాల్లోని సారా బట్టీలపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. పెదబొడ్డేపల్లి, పెదపేట కొంతలం, ధర్మసాగరం తదితర గ్రామాలపై గట్టి నిఘా పెట్టారు. సారాతో పట్టుబడిన నిందితుడిపైనే కాకుండా తయారీదారులపై అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. సారా తయారీకి మూలమైన నల్ల బెల్లం విక్రయాలు అధికంగా జరిపిన వ్యాపారులపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ మూడు నెలల కాలంలో 112 కేసులు నమోదు చేసి 115 మందిని అరెస్టు చేశారు. 114 లీటర్ల సారాను సీజ్ చేశారు. 30,440 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. 113 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సారా వృత్తిగా జీవించే వారి కుటుంబాలను గుర్తించి, వారికి ప్రభుత్వం నుంచి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు నర్సీపట్నం ఎక్సైజ్ సీఐ సునీల్ కుమార్ చెప్పారు.

ఏపీ విలేజ్ రెవెన్యూ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీ ఆవిష్కరణలో శ్రీరామ్మూర్తి, రామకాసు

కె.కోటపాడు: ఏపీ విలేజ్ రెవెన్యూ అసోసియేషన్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం కె.కోటపాడులో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ వీఆర్వో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు హాజరయ్యారు. వీరు డైరీ, క్యాలెండర్లను అసోసియేషన్ సభ్యులకు అందించారు. ఇటీవల డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన కె.కోటపాడు తహసీల్దార్ భాగ్యవతిని ఘనంగా సన్మానించారు. సంఘ ఉపాధ్యక్షుడు పూడి సురేష్, కె.గౌరీశంకర్, శివ, గంగునాయుడు, జగదీష్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

రావికమతం (చోడవరం): కోడిపందేలాటలపై పోలీసులు దాడి చేశారు. పందేలు ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. రావికమతం మండలం పి.పొన్నవోలు, జి.చీడిపల్లి, చినపాచిలి గ్రామాల్లో తోటల్లో కోడిపందాలు నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న రావికమతం, కొత్తకోట ఎస్ఐలు రఘువర్మ, శ్రీనివాస్ శుక్రవారం తమ సిబ్బందితో వెళ్లి ఆయా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఏడుగుర్ని అరెస్టు చేసి వారి నుంచి రూ.6,700, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు చెప్పారు. జి.జీడిపల్లి తోటల్లో నలుగుర్ని, చినపాచిలో ముగ్గుర్ని అరెస్టు చేశామని చెప్పారు.



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయం



కొలువుదీరిన గౌరీపరమేశ్వరులు



విద్యుత్ లైటింగ్‌తో వెలిగిపోతున్న గౌరమ్మ



వేల్పులవీధి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన అయోధ్య రామాయణం సెట్

గౌరమ్మ ఉత్సవానికి వేళాయె...

- నేడు గౌరీపరమేశ్వరుల మహోత్సవం
- ప్రత్యేక పోలీస్ బందోబస్తు, ఏర్పాట్లు పూర్తి
- 2 లక్షల మంది భక్తులు వస్తారని అంచనా

అనకాపల్లి: ఉత్తరాంధ్రలో ప్రఖ్యాతిగాంచిన వేల్పుల వీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సంక్రాంతి పండుగ ముగిసిన అనంతరం మూడో శనివారం నిర్వహించే ఈ ఉత్సవాలు సందర్భంగా ఇప్పటికే పట్టణ ప్రాంతం విద్యుత్ దీపాలంకరణతో మెరిసిపోతోంది. ఉద్యోగ, వ్యాపార నిమిత్తం వివిధ ప్రాంతాల్లో నివసించే వారు అమ్మవారి ఉత్సవాన్ని తిలకించేందుకు ఏటా వస్తుంటారు. ఇక్కడ వేల్పులవీధిలో 171 సంవత్సరాల క్రితం వేల్పులవారి స్వగృహంలో గౌరమ్మ వెలసింది. దివంగత కొమ్మాన నర్సింగరావు తన భార్య పార్వతమ్మపై ప్రేమతో 1920లో ఓ పాకలో అమ్మవారిని ప్రతిష్టించాడు. అప్పటి నుంచి ఏటా డిసెంబర్ మూడో వారంలో వేల్పులవీధి కుటుంబీకులు అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించేవారు. ఈఉత్సవం వేల్పులవీధికి పరిమితం కాకూడదని వీధి పెద్దలు దివంగత వాకాడ దాలెప్ప, రౌతు ఆదినారాయణ, బోయిన రమణ తదితరులు నిర్ణయం మేరకు పట్టణవాసులు ఏటా జనవరి మూడో శనివారం నిర్వహిస్తున్నారు. 2005లో మెయిన్ రోడ్డు విస్తరణలో అమ్మవారి పాతగుడి దెబ్బతిన్న కారణంగా స్థానికులు, భక్తులతో 2022లో కొత్త ఆలయాన్ని నిర్మించారు.

అమ్మవారి ఊరేగింపు....

మొదట్లో వేల్పులవీధిలో మాత్రమే అమ్మవారిని ఊరేగించేవారు. ప్రస్తుతం మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. శనివారం ఉదయం అనకాపల్లి వీధుల్లో ఊరేగింపు ప్రారంభమై సోమవారం తెల్లవారు జామున స్థానిక శారదానదిలో అనుపుతో ముగిస్తారు. ఈ మహోత్సవానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి రెండు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.



విద్యుత్ లైటింగ్

నేలవేషాలు...

రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన కళాకారులతో పాటు ఒడిశా, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో నేల వేషాలు, చిడతలు, తప్పెటగుళ్లు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు. ఈ మేరకు పూర్తి ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకునే కలర్‌ఫుల్ మందుగుండు...

గౌరమ్మ ఉత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ క్రీడా మైదానంలో సీతారామయ్య మందుగుండు విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. వివిధ ఆకృతులు ఏర్పాటు చేసి... వాటికి ముందు గుండు అమర్చి చేసే విన్యాసాలు కచ్చితంగా చూసి తీరాల్సిందే. సుమారుగా రెండు గంటల పాటు కలర్‌ఫుల్ మందుగుండు వెలిగిస్తారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు



గౌరీపరమేశ్వరుల ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు తమ వంతు సహాయం అందిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. భారీ విద్యుత్ లైటింగ్, స్టేజ్ ప్రోగ్రాంలు, నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. పట్టణ, ట్రాఫిక్ సీఐల ఆధ్వర్యంలో 200 మంది పోలీస్ బందోబస్తు నిర్వహించనున్నారు.

– వాకాడ బాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు, అనకాపల్లి

స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివస్ విజయవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్ జాహ్నవి



తుమ్మపాల: అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి తెలిపారు. ఈ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో శుక్రవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రతి మూడో శనివారం 'స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్' కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 18న కడపలో సీఎం చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కార్యక్రమం చేపట్టి అధికారులు, సిబ్బంది, ప్రజలు అంకితభావంతో భాగస్వాములు కావాలన్నారు. న్యూ ఇయర్ – క్లీన్ స్టార్ట్ థీమ్‌తో కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రుల పరిసరాలను శుభ్రం చేయాలన్నారు. గ్రామాల్లో చెత్త కుప్పల తొలగింపు, తాగు నీటి వసతుల క్లోరినేషన్, సామాజిక మరుగుదొడ్లను గుర్తించడం, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించేలా అవగాహన కల్పించడం, ఇంటింటా తడిచెత్త – పొడిచెత్త ప్రక్రియ కొనసాగించడం, వంటి పనులను చేపట్టాలన్నారు. జిల్లా పరిషత్, ముఖ్య కార్యనిర్వహణాధికారి పి. నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటర్ జిల్లా కో ఆర్డినేటర్ ఇ. నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషా రాణి, నియోజకవర్గాల, మండలాల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

మద్దతు ధర కోసం జీడి రైతుల పాదయాత్ర

రావికమతం(చోడవరం)/దేవరాపల్లి: జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించడంతోపాటు ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం రావికమతం మండలం నేరేడు బంద నుంచి అజయ్‌పురం వరకూ జీడిమామిడి రైతులు ఐదు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి ఆందోళన నిర్వహించారు. జీడితోటల మధ్య నుంచి వీరు పాదయాత్ర చేశారు. గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. దేవరాపల్లి మండలం వాలాబు పంచాయతీలో స్థానిక గిరిజన జీడి రైతులతో కలిసి సీపీఎం నేత వెంకన్నశుక్రవారం జీడి పంటలను పరిశీలించారు. వెంకన్న మాట్లాడుతూ జీడి రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే దశల వారీగా ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడికి మాత్రం మద్దతు ధర ప్రకటించడం లేదన్నారు. దీనిని ఆసరాగా తీసుకుంటున్న ప్రైవేటు వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాయితీలను పునరుద్ధరించాలని, ఉపాధి హామీ పథకంలో జీడి తోటల అభివృద్ధికి ఎకరాకు రూ.9 వేల చొప్పున అందజేయాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంక్ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు, డి. శంకర్, డి.సోమయ్య, మామిడి దేముడు, సిహెచ్. ఎరకయ్య, సోముల కృష్ణ, డి. నారాయణ, పి.అప్పలరాజు పాల్గొన్నారు.



రావికమతం మండలం నేరుడు బంద నుంచి పాదయాత్ర చేస్తున్న జీడిమామిడి రైతులు, సీపీఎం కార్యకర్తలు

ఘనంగా ఐఐఎం వ్యవస్థాపక దినోత్సవం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరంలో 240 ఎకరాల విస్తర్ణంలో ఉన్న ఐఐఎం క్యాంపస్‌లో 11వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ సమీర్ వి. కామత్ మాట్లాడుతూ వైఫల్యాల ద్వారా పాఠాలు నేర్చుకోవచ్చన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ అనే నినాదంతో ప్రధాని మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతున్నారని చెప్పారు. ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ పదేళ్లలో ఐఐఎం ఎన్నో మైలురాళ్ల ను దాటిందని, అధిక నాణ్యత గల విద్యను అందించడలో ప్రఖ్యాతిని పొందిందని చెప్పారు. ఐఐఎం సభ్యురాలు మాళవిక, హరిత పాల్గొన్నారు.



భారత ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ సమీర్ వి.కామత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

ముగిసిన స్టాఫ్ నర్సుల పోస్టుల దరఖాస్తుల గడువు

మహారాణిపేట(విశాఖ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువు శుక్రవారంతో ముగిసింది. ఆఫ్‌లైన్‌లో 8,250 దరఖాస్తులు వచ్చాయని, ఆన్‌లైన్ కూడా దరఖాస్తులు పెద్దసంఖ్యలో వచ్చాయని వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ సంచాలకురాలు డాక్టర్ పి.రాధారాణి తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్ నర్సు పోస్టులకు ఏడాది ఒప్పంద ప్రాతిపదికన భర్తీ చేయడానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, విశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న 106 స్టాఫ్ నర్సు పోస్టులు భర్తీ చేస్తున్నారు. పూర్తి వివరాల కోసం https@// nagendrasvst.wordpress.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

గుండె గు'భిల్లు'


- రూ.కోటి దాటిన కరెంటు బిల్లు

అనకాపల్లి: కోటి రూపాయలు దాటిన విద్యుత్ బిల్లు చూసి వినియోగదారుడి గుండె గుభిల్లుమంది. పూడిమడక జాతీయ రహదారిలో కాండ్రేగుల జగన్నాథరావు నిర్వహిస్తున్న జిమ్‌కు డిసెంబరు నెలకు కరెంట్ బిల్లు అక్షరాలా రూ.1,01,59,217లు వచ్చింది. ప్రతి నెల విద్యుత్ బిల్లు 20 వేల నుంచి 22 వేల రూపాయలు వస్తుందని, జనవరి మొదటి వారంలో వచ్చిన బిల్లు చూసి అవాక్కయ్యానని జగన్నాథరావు చెప్పారు. విద్యుత్‌శాఖ ఈఈ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యాపార సముదాయాలకు పాత విద్యుత్‌మీటర్లను తొలగించి, స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్న సమయంలో మీటర్ రీడింగ్ తప్పుగా నమోదయిందని, జిమ్ నిర్వాహకుడు జగన్నాథరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రీడింగ్‌ను సరిచేశామని చెప్పారు.

తాండవ ప్రాజెక్టుకు లీకేజీ

- ప్రధాన గేట్ల నుంచి రోజుకు 100 క్యూసెక్కుల నీరు వృథా
- ఇదే పరిస్థితి కొనసాగితే అడుగంటనున్న జలాశయం

నాతవరం: జిల్లాలో ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. పర్యవసానంగా రిజర్వాయరు ప్రధాన గేట్లు నుంచి లీకేజీ నీరు నిత్యం వృథాగా పోతోంది. దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. తాండవ ప్రాజెక్టు ప్రమాద స్థాయి నీటిమట్టం 380 అడుగులు, డెడ్ స్టోరేజీ నీటి మట్టం 345 అడుగులుగా పరిగణిస్తారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో నాలుగు నియోజకవర్గాల పరిధిలో 52 వేల ఎకరాలకు సాగు నీరు సరఫరా చేస్తోంది. గతేడాది ఆగస్టు 19న ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు ప్రాజెక్టు నీటిని ఆయకట్టుకు విడుదల చేశారు. వరి పండాక డిసెంబరు 15వ తేదీన ఆయకట్టుకు నీటిని నిలుపుదల చేశారు. ఆ సమయానికి తాండవలో నీటి మట్టం 370.3 అడుగులు ఉండేది. గేట్లు లీకేజీ ద్వారా నీరు పోవడంతో ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 368.2 అడుగులకు తగ్గింది. రోజుకు 80 నుంచి 100 క్యూసెక్కుల మధ్య వృథాగా పోతోంది. డిసెంబరు మొదటి వారం నుంచి తాండవ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి నీరు రావడం లేదు.



తాండవ ప్రధాన గేట్లు ద్వారా కాలువలో ప్రవహిస్తున్న లీకేజీ నీరు

ఇటు లీకేజీ నీరు పోవడంతో అటు ఎగువ ప్రాంతం నుంచి ఇన్‌ఫ్లో లేకపోవడంతో ప్రాజెక్టు అడుగంటిపోయే ప్రమాదముంది. సాగునీరు మాట ఎలా ఉన్న చేపల వేటపై జీవనం సాగించే రెండు మండలాలు పరిధిలో వెయ్యి మత్స్యకార కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తమవుతోంది. వచ్చే ఏడాది ఖరీఫ్ సాగుకు నీరు సరఫరా కష్టమేనని వారు చెబుతున్నారు.

కూటమి నేతల కబుర్లే..

అధికారంలోకి వచ్చాక కూటమి నేతలు తాండవ ప్రాజెక్టుపై అనేక మాటలు వల్లెవేశారు. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, తాండవ ప్రాజెక్టును తాము పూర్తిగా అభివృద్ధి చేస్తామంటూ ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. గత నెలలో నూతనంగా ప్రాజెక్టు కమిటీని ఎన్నుకున్నారు. కొత్త కమిటీకి ఇక్కడ లీకేజీలను అరికట్టాలన్న ఆలోచన చేయలేదు. ఈ విషయంపై తాండవ ప్రాజెక్టు జేఈ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ లీకేజీ నీరు వృథాగా పోవడం వాస్తవమేనన్నారు. నీటి మట్టం క్రమేపి తగ్గుతుందన్నారు గేట్లు మరమ్మతులు, ఇతర పనులు చేసేందుకు రూ.12.50 లక్షలు ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. నిధులు వచ్చిన వెంటనే పనులు చేస్తామన్నారు.




తాండవ మెయిన్‌గేట్లు వద్ద తగ్గిన నీటిమట్టం



ప్రాజెక్టు నుంచి పోతున్న లీకేజీ నీరు

చైనా మాంజాతో వృద్ధుడి ముక్కుకు గాయం



గాయపడిన వృద్ధుడు



ప్రమాదానికి కారణమైన చైనా మాంజా కలిగిన గాలిపటం

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం
- బీచ్‌రోడ్డులో సంఘటన
- నిషేధం ఉన్నా ఆగని చైనా మాంజాల విక్రయాలు

ఏయూక్యాంపస్: బీచ్‌రోడ్డులో చైనా మాంజా తగిలి ఓ వృద్ధుడి ముక్కుపై కోసుకుపోయింది. త్రుటిలో ప్రమాదం తప్పింది. కోస్టల్ బ్యాటరీ నుంచి నోవెటెల్‌కి వెళ్లే మార్గంలో శుక్రవారం సాయంత్రం ఈ సంఘటన జరిగింది. ద్విచక్ర వాహనంపై హెల్మెట్ ధరించి వెళుతున్న వృద్ధునికి గాలిపటం ఎగురవేయడానికి ఉపయోగించే దారం(చైనా మాంజా) తలిగింది. దీనిని హెల్మెట్ అద్దం కూడా ఆపలేకపోయింది. పదునైన చైనా మాంజా తగిలి వృద్ధుని ముక్కుప్రాంతంలో గాయమైంది. తీవ్రంగా రక్తస్రావమై వృద్ధుని దుస్తులు రక్తంతో తడిసిపోయాయి. వెంటనే స్థానికులు స్పందించి బాధితుడికి సపర్యలు చేసి, ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడు వాహనంపై నెమ్మదిగా వెళ్లడం, హెల్మెట్ ధరించడంతో ప్రాణాపాయం తప్పిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసుల వద్ద ఎటువంటి సమాచారం లేకపోవడం గమనార్హం.

ప్రమాదరకం...చైనా మాంజా...

ప్రమాదకరమైన చైనా మాంజాపై నిషేధం ఉంది. పతంగులు ఎగురవేసేందుకు ఉపయోగించే దారానికి సన్నని గాజు పొడిని పూస్తారు. గాలిపటాల పోటీలు జరిగే సమయంలో వేరొకరి గాలిపటం దారాన్ని కత్తిరించడానికి దీనిని వినియోగిస్తారు. గతంలో ఈ చైనా మాంజా కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో ఈ చైనా మాంజాపై నిషేధం ఉంది. వీటిని విక్రయించవద్దని పోలీసులు వ్యాపారులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చారు. అయినప్పటికీ విక్రయాలు కొనసాగుతున్నాయి.

తమిళనాడు ఉన్నతాధికారి మత్స్యగుండం సందర్శన



మత్స్యగుండంలో గోపాల్‌కు ఆలయ చరిత్ర పుస్తకాన్ని అందిస్తున్న కమిటీ ప్రతినిధులు

సాక్షి,పాడేరు/హుకుంపేట: మత్స్యగుండం మత్స్యలింగేశ్వర స్వామివారిని శుక్రవారం తమిళనాడు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.గోపాల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.మత్స్యగెడ్డ వద్ద మత్స్య దేవతలకు ఆహారం అందించారు. ఆలయ విశిష్టతను స్థానికుల నుంచి తెలుసుకున్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తమర్బ బాబూరావు, స్థానిక జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, సర్పంచ్ మఠం శాంతకుమారి, ఆలయకమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. పాడేరులో మోదకొండమ్మతల్లి ఆలయాన్ని తమిళనాడు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.గోపాల్ సందర్శించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు.

ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలి

ఉమ్మడి విశాఖ జిల్లా 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు

అనకాపల్లి: ఈ ఏడాది మే నెలలో సాధారణ బదిలీల్లో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను మైదాన ప్రాంతంలో పోస్టింగ్‌లు ఇవ్వాలని ఉమ్మడి విశాఖ జిల్లా 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు పి.శ్రీనివాసరావు, పి.సుదర్శన్. పి.అప్పారావు కోరారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఉపాధ్యాయ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ పాలనలో 1998 డీఎస్సీ క్యాలీపై అయిన ఉపాధ్యాయులకు ఉద్యోగం కల్పించారన్నారు. 2023 ఏప్రిల్‌లో జరిగిన బదిలీల్లో 1998 ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఏజెన్సీలో నియమించారన్నారు. వీరంతా 50 సంవత్సరాలు పైబడినవారే కావడంతో ఏజెన్సీలో విధులు నిర్వహించాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతూ విధులు నిర్వహిస్తున్నారని, కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత 62 సంవత్సరాలకు పెంచాలని, 12 నెలల వేతనం ఇవ్వాలని, పదవీ విరమణ తర్వాత మినిమం పింఛన్ అమలు చేయాలన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఏఐసీఓజీలో ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనిక్ వైద్యుల ప్రతిభ

మహారాణిపేట: ముంబైలో జరిగిన 67వ ఆల్ ఇండియా వార్షిక కాంగ్రెస్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ జెనెకాలజీ (ఏఐసీఓజీ) సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనిక్ విభాగం వైద్యులు,వైద్య విద్యార్థులు అకడమిక్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు గైనిక్ విభాగ వైద్యులను అభినందించారు. జాతీయ కాంగ్రెస్ అకడమిక్‌లో ప్రతిభ కనబరిచిన వైద్యులను ప్రిన్సిపాల్ ప్రశంసించారు. దేశ వ్యాప్తంగా గైనిక్ అధ్యాపకులు పీజీ విద్యార్థులతో సహా దాదాపు వేయి మంది ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. పీజీ విద్యార్థులు డాక్టర్ మాధురి నరహరిశెట్టి, డాక్టర్ శ్రీలేఖ చిందిరాల, డాక్టర్ రాగ శ్రీ పామర్తి, డాక్టర్ రంజిని పెద్దిరెడ్డి, డాక్టర్ షీలు సోనియా గుత్తికొండ, మూడవ సంవత్సరం పోస్ట్ గ్రాడ్యుయేట్ డాక్టర్ మాధురి అవార్డులు పొందారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ గైనాకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యా దేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డాక్టర్ సి.అమూల్య, డాక్టర్ జి.సౌమిని, డాక్టర్ జి. శైలజ, డాక్టర్ ఉషా ప్రసాద్, డాక్టర్ అనురాధ, డాక్టర్ పి.శైలజ మార్గదర్శకత్వంలో పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డాక్టర్ గీతా వందన, డాక్టర్ విద్యా రామ కూడా వార్షిక జాతీయ కాంగ్రెస్‌లో అకడమిక్ ప్రతిభ కనబరిచారు.



ప్రతిభ కనబరిచిన గైనిక్ వైద్యులను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

వణికిస్తున్న చలిగాలులు

చింతపల్లి: మన్యంలో పొగమంచు, చలి తీవ్రత కొనసాగుతోంది. గురువారం జి.మాడుగులలో 1.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. శుక్రవారం పాడేరు డివిజన్ పరిధి అనంతగిరిలో 10.7 డుంబ్రిగుడలో 11.4, ముంచంగిపుట్టులో 11.5, అరకులోయలో 11.7 ,హుకుంపేటలో 12.2, పెదబయలులో 12.2, పాడేరులో 13.2, గూడెంకొత్తవీధిలో 13.4, చింతపల్లిలో 14.1, కొయ్యూరులో 14.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్టు ఏడీఆర్ తెలిపారు. ఉదయం 10 వరకు మంచు అధికంగా కురవడంతో హెడ్ లైట్ల వెలుగులో వాహన చోదకులు రాకపోకలు సాగించారు. సాయంత్రం నుంచి చలిగాలులు వీస్తున్నాయి.



చింతపల్లిలో భారీగా కురుస్తున్న పొగమంచు

క్లుప్తంగా

ఘనంగా కనకమహాలక్ష్మి తీర్థం

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి ఆలయం వద్ద తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోడపెద్దు సేవ జరిగింది. తినుబండారాల అమ్మకాలు సాగాయి. స్థానికులు తీర్థంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పాసింజర్ రైళ్లు పునరుద్ధరించాలని వినతి



సూపరింటెండెంట్ అమిత్ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి: బడుగు, బలహీన వర్గాల ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని రైల్వే శాఖ పాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో సూపరింటెండెంట్ అమిత్ పాటిల్‌కు ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో రైల్వే శాఖ పాసింజర్ రైళ్లను నిలుపుదల చేసిందన్నారు. పేద ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్‌ఫాస్ట్ రైళ్లు ఎక్కాలంటే ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. రైల్వేశాఖ అధికారులు పాసింజర్ రైళ్లను నడపాలని, జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనకాపల్లి జిల్లాలో వివిధ రకాల సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వేదిక నాయకులు బండి అప్పారావు, బొడ్డు సోమరాజు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజులు, పల్లా సత్య అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం జంక్షన్‌లో తరుచూ ప్రమాదాలు

అనకాపల్లి: పరవాడ మండలం లంకెలపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద తరుచూ ప్రమాదాలు జరిగి అనేక మంది మృత్యువాత పడుతున్నారని, దీనిపై కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్‌బాబు కోరారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11న అనకాపల్లి బార్ అసోసియేషన్‌కు చెందిన సీనియర్ లాయర్ చిన్నయ్యశెట్టి లంకెలపాలెం రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వాపోయారు. గతంలో ఎస్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ లంకెలపాలెం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 5,278 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,910	4,060
మొదటి రకం	3,660	4.460
రెండో రకం	3,200	3,710
మూడో రకం	3,030	3,180

అనకాపల్లి సినిమాలు

డాకు మహారాజ్	: రాజా
పుష్ప-2	: సత్యనారాయణ స్క్రీన్-1
సంక్రాంతికి వస్తున్నాం	: సత్యనారాయణ స్క్రీన్-2
గేమ్ ఛేంజర్	: పర్లిసాయి
సంక్రాంతికి వస్తున్నాం	: షిర్డీసాయి
గేమ్ ఛేంజర్	: వెంకటేశ్వర
సంక్రాంతికి వస్తున్నాం	: శ్రీసత్య
డాకు మహారాజ్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 67 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-33 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 369 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 294 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

నేటి నుంచి స్పెషల్ డ్రైవ్

నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కొరడా ఝుళిపించేందుకు రవాణా శాఖ అధికారులు, పోలీసులు సిద్ధమయ్యారు. నేటి నుంచి ఈ నెల 21వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తారు. ఎక్కడైనా తాగి వాహనం నడిపినా, లైసెన్స్ లేకపోయినా, ఇతర భద్రతా ప్రమాణాలు పాటించక పోయినా కఠిన చర్యలు తీసుకోనున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

21వ తేదీ వరకు రవాణా శాఖ, పోలీసులు తనిఖీలు

నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలే



రోడ్డు భద్రతపై అవగాహన చేపడుతున్న రవాణా శాఖ అధికారులు



వాహనాల తనిఖీలు చేపడుతున్న పోలీసులు

తుమ్మపాల: రోడ్డెక్కితే చాలు తిరిగి గమ్యానికి చేరుకునేంత వరకు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. జనాభా పెరగడంతో ప్రతి ఇంట వాహనాలు షరామామూలే అయిపోయాయి. డ్రైవింగ్‌పై పూర్తి అవగాహన లేకుండానే ప్రతి ఒక్కరూ వాహనాలు కొనుగోలు చేసి రోడ్లపై ప్రయాణించేస్తున్నారు. దీంతో రహదారులపై నిత్యం ట్రాఫిక్ చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తోంది. దీనికి తోడు వాహన చోదకుల అవగాహనా రాహిత్యం కారణంగా ట్రాఫిక్ మరింత జటిలమవుతోంది. సంబంధిత శాఖలు ఎన్ని చర్యలు చేపట్టినా ప్రజల నుంచి సరైన సహకారం లేకపోవడంతో ఫలితం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. ప్రజలకు మరింత అవగాహన చేపట్టాలనే లక్ష్యంతో ఏటా జనవరి 16 నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు రహదారుల భద్రత మాసోత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది.

21వ తేదీ వరకు వాహనాల తనిఖీ

రోడ్డుపై మద్యం సేవించి వాహనం నడిపే వారిని బ్రీత్ ఎనలైజర్‌తోనూ, అధిక వేగంతో నడిపే వాహనాలను స్పీడ్ గన్‌తోనూ గుర్తిస్తారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ లేకుండా వాహనం నడపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి వారిపై రవాణా శాఖ, పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేయనున్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన శిబిరాలు...

రోడ్డు భద్రతపై ఈ నెల 24న డ్రైవర్లకు హెల్త్ చెకప్ చేయించడం, 25న అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, 26, 27 తేదీల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి వాకథాన్‌లు నిర్వహించడం, 30, 31 తేదీల్లో బైక్ ర్యాలీలు నిర్వహించడం వంటి కార్యక్రమాలను పోలీసులు నిర్వహిస్తారు. గోల్డెన్ అవర్, రహదారి భద్రత నిబంధనలపై మండలం, పట్టణంలో పోలీసులు ఆయా శాఖలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా అవగాహన చేపట్టేందుకు ప్రజలను సమాయత్తం చేస్తున్నారు. ముఖ్యంగా అనకాపల్లి-కశింకోట బైపాస్ రోడ్డు, అనకాపల్లి-సబ్బవరం జాతీయ



శంకరం వద్ద ప్రమాదాలకు నిలయమైన జాతీయ రహదారి

రహదారి, పట్టణంలో సుంకర మెట్ట జంక్షన్, మామిడిపాలెం జంక్షన్, పలు ప్రాంతాల్లో అధికంగా జరిగే ప్రమా దాల నివారణపై దృష్టి సారిస్తున్నారు.

నిబంధనలు బేఖాతరు...

రహదారి భద్రతలో భాగంగా ప్రతి వాహన చోదకుడూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్న నిబంధన ఉంది. ఈ విషయంలో వాహన చోదకుల నుంచి పూర్తి సహకారం ఉండటం లేదు. లైసెన్స్ అనేది రవాణా, పోలీసు శాఖల కోసమే అని చాలా మంది భావన. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండానే వాహనాలతో రోడ్డుపైకి వచ్చే వారే సగం ప్రమాదాలకు కారణం అవుతున్నారని జరిగిన ప్రమాదాల లెక్కలు చెపుతున్నాయి. దీనికి తోడు కొందరు తమ పిల్లలకు మైనారిటీ తీరకుండానే వాహనాలు ఇస్తున్నారు. వారు అతివేగం, నిర్లక్ష్యంతో రోడ్లపై వాహనాలు నడిపి పలు ప్రమాదాలకు కారణమవుతున్నారు.

ప్రయోజనాలు ఇవే..

వాహన చోదకుడు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి. రహదారిపై తిరిగే ప్రతి వాహనానికి కండీషన్ ఎంత ముఖ్యమో, లైసెన్స్, ఇన్సూరెన్స్ అంతే అవసరం. ప్రమాదాల సమయంలో వాహనం నడిపిన వ్యక్తికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే అతడితో పాటు వాహనం ఇచ్చిన సంబంధిత యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేస్తారు. డ్రైవింగ్ నిర్లక్ష్యంతో పాటు లైసెన్స్ లేకుండా వాహనం నడపడం పెద్ద తప్పిదం. దీని వల్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. వాహనానికి పూర్తిస్థాయిలో ప్రమాద బీమా ఉన్నా, లైసెన్స్ లేని వాహన చోదకుడికి అది వర్తించదు.

రోడ్డు ప్రమాదాలతో దేశ జీడీపీపై ప్రభావం

రోడ్డు భద్రత నిబంధనలపై అందరికి అవగాహన కల్పించాలనే లక్ష్యంతోనే మాసోత్సవాలను నిర్వహిస్తున్నాం. రోడ్డు ప్రమాదాల్లో అధిక సంఖ్యలో 18 నుంచి 30 ఏళ్ల మధ్య యువత ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. వారి మరణం దేశ జీడీపీపై ప్రభావం చూపుతుందని అనేక సర్వేలు చెబుతున్నాయి. సున్నా శాతంలో ప్రమాదాలను నిర్మూలించాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. ప్రతి ద్విచక్ర వాహనదారుడు ఐఎస్ఐ మార్కు కలిగిన పూర్తిస్థాయి హెల్మెట్ ధరించి మాత్రమే రోడ్డుపై డ్రైవింగ్ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

–గోపీకృష్ణ, ఇన్‌స్పెక్టర్, రవాణా శాఖ. అనకాపల్లి

వరిమడిలో తామర పురుగు ఆశించే అవకాశం

అనకాపల్లి:

మారుతున్న వాతావరణ పరిస్థితులకు వరి నారుమడిలో తామర పురుగులు ఆశించే అవకాశం ఉన్నందున, లీటరు నీటికి మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేసి నివారించవచ్చని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరినారు మడిలో కనిష్ట ఉష్ణోగ్రతల వల్ల పైరు పెరగకుండా ఉన్నట్లయితే బూస్టర్ ఎరువులు 2 కేజీ యూరియా 2 కేజీ, పొటాష్ లేదా నీటిలో కలిపి ఎరువులు ఒక శాతం యూరియా లేదా 0.5శాతం మల్టీ కెను జింక్ సల్ఫేట్ 2 గ్రా/లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రాగిపైరు నాటే రైతులు దుక్కిలో 26 కిలోల యూరియా, 75 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కిలోల మ్యురేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. అపరాలలో చిత్త, రసం పీల్చు పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున, నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. అపరాలలో బూడిద తెగులు గమనించినట్లయితే హెక్సాకొనజోల్ 2 మి.లీ. లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ పిచికారీ చేసుకోవాలన్నారు. 30-40 రోజుల వయసు గల అపరాలలో 19:19:19 పోషకాన్ని లీటరుకు 5 గ్రాముల చొప్పున కలిపి పైరుపై పిచికారీ చేసుకుంటే దిగుబడి పెరిగే అవకాశం ఉందన్నారు. నువ్వులు ఎకరాకు 10 కిలోల ట్రైకోడెర్మా, ఒక బస్తా డీఏపీని విత్తేముందు ఆఖరి దుక్కిలో వేసుకోవాలన్నారు. విత్తిన మూడు రోజుల్లోపు లీటరు నీటికి పెండిమిథిలిన్ కలుపు మందు 3 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. నువ్వు పంటలో బూడిద తెగులు ఆశించే అవకాశం ఉన్నందున, నివారణకు లీటరు నీటికి నీటిలో కరిగే కంధకం 3 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. వాతావరణ పరిస్థితులకు తీగజాతి కాయగూరలలో ఆకుమచ్చ తెలుగు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు లీటరు నీటికి మాంకోజెబ్ 3.0గ్రాములు చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు.

కాలుష్య నివారణతోనే మెరుగైన జీవితం



మహిళల నుంచి వివరాలు సేకరిస్తున్న జనవిజ్ఞాన వేదిక బృందం

పరవాడ: ఫార్మాసిటీకాలుష్యంతో దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్న తాడి గ్రామస్తుల జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి ప్రభుత్వం తక్షణమే కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని జనవిజ్ఞాన వేదిక అనకాపల్లి బృందం నాయకుడు కె.త్రిమూర్తులురెడ్డి డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో చేపట్టిన పర్యావరణ అవగాహన యాత్రలో భాగంగా శుక్రవారం ఫార్మాసిటీ కాలుష్యంలో చిక్కుకున్న తాడి, చినతాడి, పెదతాడి, తానాం గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వేదిక తెలుసుకుంది. ఫార్మా పరిశ్రమల కారణంగా గాలి, నీరు, భూగర్భ జలాలు పూర్తి స్థాయిలో కలుషితం అయిపోయాయని, విధి లేని పరిస్థితుల్లో తాడి గ్రామంలో నివసిస్తున్నామని అక్కడి ప్రజలు వాపోయారని తెలిపారు. గర్భం దాల్చిన మహిళలు గ్రామంలో ఉండడానికి భయపడుతున్నారని, చిన్నా పెద్ద తేడా లేకుండా శ్వాసకోశ వ్యాధులు, గుండె సంబంధిత జబ్బులు, చర్మ వ్యాధులు, ముడుకుల నొప్పులతో బాధపడుతున్నారన్నారు. కాలుష్యం బారిన పడిన మూగ జీవాలకు పునరోత్పత్తి జరగడం లేదన్నారు. పంటలు పూర్తిగా మానుకున్నామని, పండగలు పబ్బాలకు వచ్చిన ఆడ పిల్లలు పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వాసనకు ఉండడానికి ఇష్టపడడం లేదని ప్రజలు బృందం వద్ద మొరపెట్టుకున్నారని త్రిమూర్తులు రెడ్డి తెలిపారు. ఈ బృందంలో మారిశెట్టి వెంకటప్పారావు, బి.రామ్‌కుమార్, బి.ఉమామహేశ్వర రావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఉన్నారు.

ఎంపీహెచ్‌ఈవో, సీహెచ్‌వో సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో రవికుమార్

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయం డీఎంహెచ్ కార్యాలయంలో ఎంపీహెచ్‌ఈవో, సీహెచ్‌వో ఉద్యోగుల సంఘం 2025 డైరీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పడాల రవికుమార్ శుక్రవారం తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహించే వైద్య సిబ్బంది ఆయా ప్రాంతాల రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలని కోరారు. అసోసియేషన్ నాయకులు చుక్కల సత్యనారాయణ, ఐ.సురేష్‌కుమార్, కె.వి. రాజశేఖర్, టి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఉచిత పశు వైద్య శిబిరాలు

అనకాపల్లి: కశింకోట, అనకాపల్లి మండలాల్లో ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకూ పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రాంతీయ పశు వైద్యశాఖ సహాయ సంచాలకురాలు డాక్టర్ బి.సౌజన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరాల్లో పశువులు, దూడపెయ్యిలకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను అందిస్తామన్నారు. అనారోగ్యంతో ఉన్న, ఎదకు రాని, గర్భకోశ వ్యాధులున్న పశువులకు ఉచిత చికిత్సలు చేస్తామన్నారు. ప్రతి మండలంలో రోజుకు రెండు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. పశువైద్యాధికారి, పశు వైద్య సహాయకులు, రైతు సేవ కేంద్రాల్లోని పశువైద్య సహాయకులు రెండు బృందాలుగా ఏర్పడి పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. కశింకోట: మండలంలో ఈ నెలాఖరు వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తామని మండల పశు వైద్యాధికారి అల్లాన్నా జార్జి తెలిపారు. చింతలపాలెం పశు వైద్యాధికారి సిహెచ్. చైతన్యమణి, కన్నూరుపాలెం పశు వైద్యాధికారి దయానా, తన ఆధ్వర్యంలో తమ సిబ్బంది మూడు వేర్వేరు బృందాలు రోజుకి రెండు గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి సేవలందిస్తారన్నారు. మొదటి రోజున వెదురుపర్తి చింతలపాలెం, 21న తేగాడ, తీడలోను, 22న నరసింగబిల్లి, కన్నూరుపాలెం, 23న కశింకోట, ఏఎస్ పేట, 24న బయ్యవరం, అచ్చెర్ల, 25న సోమవరం, తాళ్లపాలెం, 27న విసన్నపేట, చెరకాం, 28న కొత్తపల్లి, నూతలగుంటపాలెం, 29న జమాదులపాలెం, ఉగ్గినపాలెం, 30న వై.తుని, జి. భీమవరం, 31న పేరంటాలపాలెం, గొబ్బూరు గ్రామాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు. పాడి రైతులు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిరుపేదలకు దుస్తుల పంపిణీ



నిరుపేదలకు దుస్తుల పంపిణీ చేస్తున్న తాతాజీ

అనకాపల్లి: సంక్రాంతి సందర్భంగా నిరుపేదలకు ధనవంతులు తమ వంతు సహాయం అందించాలని సిద్ధి లింగేశ్వరస్వామి దేవస్థానం మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత నుదురుపాటి తాతాజీ కోరారు. స్థానిక చిన్నవీధి తమ షాప్ వద్ద శుక్రవారం 61 మంది నిరుపేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏటా నిరుపేదలకు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్వారీ యజమానుల దోపిడీ

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- పలు శాఖల అధికారులు గైర్హాజరు
- రెండు గంటల్లో ముగిసిన సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కొన్నిశాఖల అధికారులు

అనకాపల్లి: గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వివిధ ప్రభుత్వ శాఖ అధికారులతో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా జరిగింది. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయం మేడపైన మండల పరిషత్ 15వ సర్వసభ్య సమావేశం శుక్రవారం రెండు గంటల్లో ముగిసింది. 13, 14 సర్వసభ్య సమావేశంలో జరగని పనులుపై మరో సారి చర్చించారు. కొన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు సమావేశానికి హాజరు కాలేదు. దిగువ స్థాయి అధికారులు తూతూ మంత్రంగా వచ్చి సమావేశం మధ్యలో వెళ్లిపోయారు. దాంతో ప్రజా ప్రతినిధులు తమ సమస్యలను ఎవరికి చెప్పాలో అర్థంకాక ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏవో రంగాచారి మాట్లాడుతూ రైతులకు రెండు మూడు రోజుల్లో 14 అంకెల డిజిటల్ కార్డులను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రభుత్వ లాగిన్‌ల్లో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 20న వెంకుపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. టన్ను ధాన్యానికి రూ.2,300 ఇస్తామన్నారు. మూడు తుపాన్లతో రైతులు ఇబ్బందులు పడ్డారని, పొలంలో తడిచిన ధాన్యాన్ని తీసుకుంటామన్నారు. మండలంలో 11 వేల మంది రైతులు రూ.233 కోట్ల బ్యాంకు రుణాలు తీసుకుని, సకాలంలో 752 మంది చెల్లించారన్నారు. 219 మంది రైతులకు రూ.15 లక్షలు కేంద్ర ప్రభుత్వం తిరిగి చెల్లించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ మండలంలో క్వారీలు ఎక్కువగా ఉన్నాయని, రాత్రి, పగలు అనే తేడా లేకుండా భారీ లోడులతో ప్రయాణించడంతో గ్రామాల్లో రోడ్లు గోతులమయంగా మారాయన్నారు. మైనింగ్ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్వారీ యాజమానుల ఇష్టారాజ్యమైందన్నారు. 85 క్వారీలకు పర్మిషన్లు ఇస్తే, మిగిలిన క్వారీల్లో ఎలా లావాదేవీలు జరుగుతున్నాయని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీపీ సూరిబాబు మాట్లాడుతూ మండల సమస్యలపై జిల్లా పరిషత్ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ప్రజల సమస్యలు పరిష్కరించని అధికారులు ఎందుకని ప్రశ్నించారు. కోడూరు అంగన్‌వాడీ కేంద్రంలో వివాహ వేడుకలు నిర్వహించడం ఏమిటని, అక్కడ సిబ్బందిపై ప్రభుత్వ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో డ్రైనేజీలకు నిధులు కేటాయించినప్పటికీ పనులు ఎందుకు చేపట్టడం లేదన్నారు. మైనింగ్ అధికారులు సరిగా విధులు నిర్వహించకపోడంతో క్వారీ యజమానులు దోపిడీ రాజ్యం పెరిగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కె.వి.నరసింహారావు, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్, వైస్ ఎంపీపీ అయితా రాము, తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడు లారీలతో పాడవుతున్న బ్రిడ్జి, రోడ్డు



మండలంలో కూండ్రం, కుంచంగి ప్రాంతాల నుంచి అధికలోడుతో లారీలు రావడంతో కొత్తూరు ఫ్లైఓవర్‌పై రోడ్డు పాడవుతుందని కొత్తూరు సర్పంచ్ ఎస్.లక్ష్మి ఆరోపించారు. బ్రిడ్జికి దగ్గరలో డీఎస్పీ కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్ రహదారి మీదుగా భారీ క్వారీ లారీలు వెళ్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

ముక్కిన ధాన్యాన్ని ప్రభుత్వం తీసుకోవాలి



ఈ ఏడాది మూడు తుపాన్ల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తుమ్మపాల ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు వాపోయారు. రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిన రెండు, మూడు రోజుల్లో నగదు చెల్లించాలన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు నేటి వరకూ ఇవ్వలేదన్నారు. పంట నష్టం జరిగిన రైతులకు సకాలంలో నగదు అందజేయాలని, ఈ విషయంపై జిల్లా పరిషత్ సమావేశంలో చర్చించాలన్నారు.

క్వారీలపై పర్యవేక్షణ ఎక్కడ.. ?



భారీ లోడుతో క్వారీ లారీలు గ్రామాల నుంచి పట్టణానికి రాకపోకలు సాగిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకుండా పోయిందని కొత్త తలారివానిపాలెం ఎంపీటీసీ నారిపిన్ని చంద్రశేఖర్ ఆగ్రహించారు. క్వారీని లీజ్‌దారులు నిబంధనలు పాటించడం లేదన్నారు. లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకునే ముందు క్వారీ యజమానులను హెచ్చరించాలని అధికలోడు వద్దని మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులను కోరారు. 25 టన్నుల లారీ 50 టన్నులు లోడుతో వెళ్లడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. పర్మిషన్ లేకుండా నిర్వహిస్తున్న క్వారీలపై చర్యలు తీసుకోవాలన్నారు.

యోగానంద నారసింహునిగా అప్పన్న

సింహాచలం: సింహగిరిపై రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి యోగానంద నారసింహస్వామి అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని యోగానంద నారసింహుడిగా అలంకరించి పల్లకిలో ఆశీనులను చేశారు. ఆళ్వారులను వేరొక పల్లకిలో ఉంచి సాయంత్రం సింహగిరి మాడ వీధిల్లో వైభవంగా తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతి అందజేశారు. తిరువీధిలో స్వామిని భక్తులు దర్శించుకుని ఆశీస్సులు పొందారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోడిపందెం రాయుళ్లపై కేసు

అనకాపల్లి: మండలంలో వెంకుపాలెం, గోపాలపురం గ్రామాల్లో శుక్రవారం కోడిపందాలు ఆడుతున్న నలుగురిపై రూరల్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్ఐ రవికుమార్ వివరాలు మేరకు... రెండు గ్రామాల్లో వీరు నాలుగు కోళ్లతో పందేలు ఆడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,500తోపాటు కోళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

సంపూర్ణ అక్షరాస్యత ప్రతి ఒక్కరి బాధ్యత



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

సబ్బవరం: నిరక్షరాస్యులైన వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అనకాపల్లి జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. శచీదేవి పిలుపునిచ్చారు. సబ్బవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమంపై జిల్లాస్థాయిలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంపీడీవోలు, వెలుగు ఏపీఎంలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన టాటా కన్సెల్టెన్సీ సర్వీసెస్ రాష్ట్ర ఇన్‌చార్జి విశ్వనాథ్ శ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరాస్యత కార్యక్రమాల్లో సాంకేతిక పరిజ్ఞానం ఆవశ్యకతను వివరిస్తూ టాటా కన్సల్టెన్సీ దేశ వ్యాప్తంగా అక్షరాస్యతా పెరుగుదలకు చేస్తున్న కృషిని వివరించారు. అదే విధంగా వాలంటరీ టీచర్లను ఆ దిశగా సాంకేతికంగా అభివృద్ధి చేయాలని కోరారు. వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు ఎస్ఎస్ వర్మ మాట్లాడుతూ అక్షరాస్యత అవసరం, ప్రయోజనాలను వివరించారు. జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి ఎస్. మంజుల వాణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉల్లాస్ అక్షరాస్యతా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కోరారు. వయోజన విద్య అనకాపల్లి నోడల్ అఫీషర్ డి. చిన్నికృష్ణ శిక్షణాంశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ కె. శ్రీనివాస్, వివిధ మండలాల ఎంపీడీవోలు, డీఆర్‌డీఏ ఏపీఎంలు పాల్గొన్నారు.